

సోమశిలలో 51.081 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 51.081 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 1,080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.96,580
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,774
3 శాతం జీఎస్టీతో	రూ.9,037
నవర (8 గ్రా)	రూ.72,296

గరిష్టం/కనిష్టం
38.3 /29.4

వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో 60 శాతం తేమ నమోదైంది.

న్యూస్‌రీల్

ఇంటర్ ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆర్‌ఐఓ వరప్రసాద రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించవచ్చన్నారు. అయితే ఈ పరీక్షలకు సంబంధించి అపరాధ రుసుం, తత్కాల్ పద్ధతిన ఫీజు చెల్లించే అవకాశం లేదన్నారు.

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నెల్లూరు(టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతి, యువకులకు అసెంబ్లీ ఆపరేటర్, రెఫ్రిజిరేటర్ ఎయిర్ కండిషనర్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న వారు ఐటీఐకు వచ్చి వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494456326 నంబరులో సంప్రదించాలన్నారు.

తూ.కొ. వెరిఫికేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని తూనికలు, కొలతల పరికరాల వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పారిశ్రామిక శాఖ వెబ్‌సైట్‌లోని సింగిల్ డెస్క్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడానికి వినియోగదారులు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు వంటి అవసరమైన వివరాలు అందించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులపై లీగల్ మెట్రాలజీ అధికారి తూకం, కొలత పరికరాలను భౌతికంగా ధ్రువీకరించి ఆమోదిస్తారన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

అమాయకులపై అక్రమ కేసు నమోదు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అక్రమ మైనింగ్‌ను డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరిస్తున్నారనే అనుమానంతో కొందరు రౌడీమూకల ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు అమాయకులపై కేసును నమోదు చేశారు. అయితే సాయంత్రం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ ఘటన సైదాపురంలో శుక్రవారం జరిగింది. ముగ్గురు యువకులు చాగణం సమీపంలోని ఓ మైన్ సమీపంలో ఓ వాహనంలో ఉన్నారు. కొందరు రౌడీమూకలు వచ్చి ఈ ప్రాంతంలో ఏమి పని ఉందంటూ దబాయించడంతోపాటు మీరు ఇక్కడ ఏమైనా డ్రోన్లను పంపుతున్నారా అంటూ ప్రశ్నించారు. ఆ ముగ్గురిపై 20 మంది రౌడీమూకలు దాడి చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు రౌడీ మూకల మాటలకే విలువ ఇచ్చి ఆ ముగ్గురుపై కేసులను నమోదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీంతో సాయంత్రం కల్లా స్టేషన్ బెయిల్ కూడా ఇచి పంపినట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

- మరుగుదొడ్లలో వైద్యశాల మందులు
- రోగులకు అందక కాలం చెల్లాయి



మరుగుదొడ్డిలో పడేసిన కాలం చెల్లిన మందులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందించాల్సిన వివిధ రకాల మందులు మరుగుదొడ్డిలో ప్రత్యక్షమయ్యాయి. అక్కడి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యశాలలకు మందులు పంపిస్తున్నా.. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో అవి రోగులకు అందడం లేదు. దీంతో కాలం చెల్లడంతో వైద్యశాలలో ఉన్న నాలుగు మరుగుదొడ్డిలో ఈ మందులు నింపి డోర్లు మూసేశారు. ముఖ్యంగా టాబ్లెట్లు, సిరప్‌లు, పలు రకాల కాలం చెల్లిన ఇంజక్షన్లు మరుగుదొడ్లలో పడేశారు. గండిపాళెం పీహెచ్‌సీకి నిత్యం ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారికి అవసరం మేరకు మందులు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ అలా జరగడం లేదు. ఫార్మాసిస్టు సక్రమంగా విధులకు హాజరుకాక పోవడం, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం ఉదయగిరి నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై దృష్టి సారించి ఇందుకు కారకులైన వైద్య ఆరోగ్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భూగర్భం మహా విధ్వంసం

- విచ్చలవిడిగా తవ్వేసి సహజ వనరులు దోపిడీ
- మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికార యంత్రాంగం
- రూ.కోట్లు కురిపిస్తున్న అక్రమార్జన





జిల్లాలో నదులు, భూములు, చెరువుల మహా విధ్వంసం.. మహా యజ్ఞంలా సాగుతోంది. ఇసుక, మట్టి, గ్రావెల్, క్వార్ట్జ, మైకా వంటి సహజ వనరుల సంపద దోపిడీకి తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించే వారిపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. అడ్డొస్తే అంతం చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీ తమ షాడోలను ముందు పెట్టి వెనుక నుంచి వ్యవహారాలను నడిపిస్తున్నారు. టీడీపీ నేతల దాష్టీకాన్ని అడ్డుకోవాల్సిన మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీసులు ధ్రుతరాష్ట్రుల్లా వ్యవహరిస్తున్నారు. 'తిలాపాపం తలాపిడికెడు' చందంగా అవినీతిలో భాగస్వామ్యం అవుతున్నారు.

నదులు, భూములు, చెరువులను చెర పట్టిన తమ్ముళ్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : జిల్లాలో టీడీపీ శ్రేణులు తాలిబన్లనే తలదన్నే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఊరూరా పార్టీ కేడర్ మాఫియాగా తయారై ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా దందాకు పాల్పడుతోంది. సహజ వనరుల అక్రమ రవాణా సాగిస్తూ వందల రూ.కోట్లు కొల్లగొట్టారు. ఈ దందాల నేపథ్యంలో ఎమ్మెల్యే, మంత్రులు, ఎంపీల మధ్య అంతర్గత దూరాలు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒకరి నియోజకవర్గంలో మరొకరు వేలు, కాలు పెట్టడానికి వీల్లేదన్నట్లుగా గిరి గీసుకుని అక్రమ దందాను నడిపిస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. అధికార పార్టీ నేతలైనా.. ప్రతిపక్ష నేతలైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే భయోత్పాతం సృష్టిస్తున్నారు.

నెల్లూరు రూరల్‌లో ఇసుక, గ్రావెల్



కల్లూరుపల్లి చెరువులో నిలువెత్తు గోతులు పెట్టి మట్టి తవ్వకాలు

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం ఇసుక రీచ్ నుంచి టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. జేసీబీలను వినియోగించకూడదని కలెక్టర్ ఆదేశించినా ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. యంత్రాలతో రాత్రిళ్లు ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. టిప్పర్లలో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు మామూళ్లు చేరడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు ఉన్నాయి. నరసింహకొండకు సమీపంలోని కొమ్మరపూడి వద్ద టీడీపీ నేతలు విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. 'సాక్షి'లో కథనాలు వచ్చినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలన్నీ షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో జరుగుతుండంతో ఇక్కడ అంతా గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతోంది.

రూ. వందల కోట్ల దందా

మైనింగ్ అధికారులు లెక్కల ప్రకారం చూస్తే ఎకరం భూమిలో మీటరు లోతున తవ్వకాలు జరిపితే 4 వేల ఘనపు మీటర్ల ఖనిజం (గ్రావెల్)లభిస్తోంది. టిప్పర్‌కు నిండుగా నింపితే 12 క్యూబిక్ మీటర్లు పడుతుంది. అంటే ఎకరాకు 400 టిప్పర్లు గ్రావెల్ వస్తుంది. ఈ లెక్కన జిల్లాలో నెల్లూరు సిటీ మినహా మిగిలిన నియోజకవర్గాల పరిధిలో గ్రావెల్ దందా విచ్చలవిడిగా జరుగుతోంది. ప్రతి రోజూ ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 200 నుంచి 300 టిప్పర్ల గ్రావెల్ మెటల్ దోపిడీ జరుగుతోంది.



సైదాపురంలో క్వార్ట్జ మైనింగ్

విచ్చలవిడిగా క్వార్ట్జ్, మైకా తవ్వకాలు

జిల్లాలో సైదాపురం, ఉదయగిరి, గూడూరు, నియోజకవర్గాల్లో మైకా, క్వార్ట్జ్ వంటి విలువైన ఖనిజం అతి పెద్ద దోపిడీగా చెప్పొచ్చు. క్వార్ట్జ్ ఖనిజం అయితే నిత్యం సుమారు 200 లారీల్లో అక్రమ రవాణా జరుగుతోందని అంచనా. స్థానికేతర పర్మిట్లతో ఇక్కడి నుంచి తమిళనాడు, కేరళ, కర్ణాటకు తరలిపోతోంది. ఒక్కొక్క లారీలో 40 నుంచి 60 టన్నుల వరకు ఉంటుంది. ఈ లెక్కన సగటు నిత్యం 10 వేల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్ ఖనిజం రవాణా సాగుతోంది. ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణిపై కేసులో మైనింగ్ శాఖ అధికారుల లెక్కల ప్రకారం చూస్తే ఒక్క మెట్రిక్ టన్ను రూ.2 లక్షలు. ఈ లెక్కన నిత్యం రూ.200 ఖనిజాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కనుసన్నల్లో దోపిడీ జరుగుతుంది.

సర్వేపల్లిలో సర్వం చెర

సర్వేపల్లి నియోజకవర్గంలో సహజ వనరులు బూడిద నుంచి గ్రావెల్, ఇసుక, మట్టి, నీరు వరకు సర్వం చెర పట్టారు. పొదలకూరు మండలం సూరాయపాళెం పెన్నా నదిలో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తోడుతున్నారు. సుమారు అర కి.మీ. మేర నదిలోకి గ్రావెల్ రోడ్డును నిర్మించి భారీ యంత్రాలను నదిలోకి దింపి ఇసుకను తవ్వుతున్నారు. రీచ్‌ల నుంచి నిత్యం సుమారు 600 టన్నుల ఇసుకను తరలిస్తుంటే.. అధికారులు 5 వేల టన్నుల ఇసుకనే ఇక్కడి నుంచి తరలించినట్టు లెక్కలు చూపుతున్నారు. టన్నుకు రూ.250 వసూలు చేస్తూ ప్రభుత్వానికి సీనరైజ్ కింద రూ.78 చెల్లిస్తున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు అధికార ఒత్తిడులతో పట్టించుకోవడం లేదు. ఎవరైనా చొరవ తీసుకుని అక్రమ గ్రావెల్ వాహనాలను ఆపితే కేసులు పెడుతున్నారు. కేసుల భయంతో ఆయా గ్రామస్తులు పట్టించుకోవడం లేదు.

కందుకూరును కుళ్ల బొడిచేస్తున్నారు..

ప్రకృతి సంపదైన ఇసుక అధికార పార్టీ నాయకులకు ఆదాయ వనరుగా మారింది. నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో ఇసుకను అక్రమంగా కొల్లగొడుతున్నారు. ప్రధానంగా కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు, లింగసముద్రం, వలేటివారిపాళెం మండలాల పరిధిలో మన్నేరు, పాలేరు, ఉప్పుటేరు వంటి నదుల పరీవాహక ప్రాంతాల్లో అడుగడుగున ఇసుక రీచ్‌ల నుంచి భారీగా తరలిస్తున్నారు. లోకేశ్ టీమ్ పేరుతో మన్నేరు నుంచి టీడీపీ నేతలు, కరేడు అటవీ భూముల్లో టీడీపీ నేత పోలుబోయిన శ్రీనివాసులు ఇసుకను హేచరీలకు రవాణా చేస్తున్నారు. సముద్ర అలల తాకిడికి అడ్డుగా ఉండే తీరప్రాంతంలోని అలగాయపాళెం, టెంకాయచెట్లపాళెం గ్రామాల్లో టీడీపీ నేత రామదాసు సముద్రపు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరించే కొందరు టీడీపీ నాయకులు టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

చెరువులు, ప్రభుత్వ భూముల్లో గ్రా'వెల్'



దగదర్తిలో గ్రావెల్ తవ్వకాలు

కావలి నియోజకవర్గం గ్రావెల్ మాఫియాకు అడ్డాగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్యా కృష్ణారెడ్డి) కనుసన్నల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నియోజకవర్గ పరిధిలోని దగదర్తి, కావలి, అల్లూరు మండల్లాల్లోని చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో భారీ యంత్రాలు ఉపయోగించి గ్రావెల్‌ను అక్రమ రవాణా సాగిస్తున్నారు. లేఅవుట్లకు, ఇతర వాణిజ్య అవసరాలకు గ్రావెల్ తరలించేందుకు రాత్రీ పగలూ తేడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. దగదర్తి మండలం దామవరం వద్ద ఎయిర్‌పోర్ట్‌కు కేటాయించిన భూములు, పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లోనూ గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. చెరువు పోరంబోకు భూములు, మేత పోరంబోకు భూములు అయితే తవ్వకాల కారణంగా స్వరూపం కోల్పోతున్నాయి. కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో నిత్యం వందల టిప్పర్ల గ్రావెల్ తరలిపోతోంది.

మెట్టలో గ్రావెల్, క్వార్ట్జ్ మెటల్

ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామాల్లో అపారంగా ఉన్న వైట్ క్వార్ట్జ్ సంపదను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అండదో తమ్ముళ్లు దోచేస్తున్నారు. దుత్తలూరు మండలం బండకిందపల్లి, వింజమూరు మండలం వెంకటాద్రిపురంలో అనుమతులు లేకుండానే కంకర క్రషర్లు ఏర్పాటు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారు. వింజమూరు మండలం నల్లగొండ్ల ప్రాంతంలో నాణ్యమైన గ్రావెల్‌తోపాటు, రఫ్ స్టోన్ కూడా లభిస్తోంది.

పెన్నమ్మ గర్భశోకం

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్ వద్ద మంత్రి నారాయణ అండతో టీడీపీ నేతలు అనధికారికంగా రీచ్‌ను నిర్వహిస్తున్నారు. నేరుగా రీచ్ వద్దకే కార్పొరేషన్ నిధులతో రహదారిని ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక విధానం ముసుగేసి పగటి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. రాత్రయితే చాలు టీడీపీ నేతలు వారి అనుచర వర్గం యంత్రాలు పెట్టి పెన్నా నదిని కుళ్లబొడుస్తున్నారు. నిత్యం 50 భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.

స్పందించకపోతే స్తంభింపజేస్తాం

- తెల్లరాయి దోపిడీపై చర్యలు తీసుకోండి
- బ్లాస్టింగ్‌లను వెంటనే ఆపాలి
- జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరిషా



ఎస్సై క్రాంతికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న శిరిషా

సైదాపురం: తెల్లరాయి దొంగలపై కఠినమైన చర్యలు తీసుకోకపోతే మైనింగ్ కార్యకలాపాలను స్తంభింప చేస్తామని జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్, మాజీ రాష్ట్ర నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరిషాయాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సైదాపురం ఎస్సై క్రాంతికుమార్‌కు రెండో సారి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చాగణం రాజుపాళెంలోని సిద్ధి వినాయక, సైదాపురం సమీపంలోని శ్రీనివాస పద్మావతి గనుల్లో అక్రమంగా బ్లాస్టింగ్ జరుగుతుందంటూ గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆత్మకూరు డీఎస్పీకి కూడా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. ముగ్గురు అమాయకులపై దాడులు చేసిన 20 మంది రౌడీమూకలపై కూడా సమగ్ర విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉన్న ఖనిజాన్ని అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గు చేటుగా ఉందని ఆమె విమర్శించారు. నిత్యం ప్రమాదభరితంగా బ్లాస్టింగ్‌లు చేస్తున్నా కూడా సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తురో అర్థం కావడం లేదన్నారు.

స్టైఫండ్‌తో కూడిన శిక్షణ, ఉద్యోగావకాశాలు

నెల్లూరు (అర్బన్): డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ శిక్షణా కోర్సులను బొల్లినేని మెడ్ స్కిల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది శిక్షణా కాలంలో ఆరు నెలల పాటు స్టైఫండ్ ఇస్తామన్నారు. శిక్షణానంతరం ఉద్యోగం కల్పిస్తామన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపున్న డిగ్రీ పాస్/ఫెయిలైన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా, బీఎస్సీ పారామెడికల్, నర్సింగ్, ఎంఎల్‌టీ, బీపీటీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సుల్లో చదవాలనుకునే విద్యార్థులు 76809 45357, 79950 13422 నంబర్లకు కాల్ చేయాలని కోరారు. ఇతర వివరాలకు బొల్లినేని కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో సంప్రదించవచ్చన్నారు.

మైనింగ్ మాఫియాకే డాన్!

గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) అధికారి.. మైనింగ్ మాఫియాకే డాన్‌గా వ్యవహరిస్తూ రాజకీయ వివాదాలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సైదాపురం గనుల సిండికేట్ మాఫియా అండతో ఆ సీట్లో కూర్చొన్న సదరు అధికారి అవినీతి, అక్రమాలకు రాచబాట వేస్తూ సర్వం తానై మాఫియాను నడిపిస్తున్నాడు.

- కూటమి నేతల అండతో సూపర్ బాస్‌లా..
- అక్రమ దందాను నడిపిస్తున్న అధికారి
- కళ్ల ముందు దోపిడీ జరుగుతున్నా.. పట్టించుకోని కబోధి
- తప్పుడు కేసులతో ప్రతిపక్ష నేతలకు వేధింపులు
- ప్రతిపక్ష నేతలను అగౌరపరిచేలా వ్యవహారం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆయనొక పబ్లిక్ సర్వెంట్ అనే విషయం మరిచిపోయి.. మైనింగ్ మాఫియాను తన కనుసన్నల్లో నడిపిస్తూ సూపర్ బాస్‌లాగా వ్యవహరిస్తున్నారు. క్వార్ట్జ్ మైనింగ్, కంకర క్వారీలు, ఇసుక, గ్రావెల్ మాఫియాలతో అంట కాగుతున్నారన్న ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నేతల అక్రమ దందాకు అండగా ఉంటూ ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధించే స్థాయికి చేరారు.

ప్రతిపక్ష నేతలను అగౌరపరుస్తూ..

సైదాపురంలో మైకా, క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మూతపడిన గనులకు వెంటనే అనుమతులివ్వాలని కోరడానికి వచ్చిన వెంకటగిరి రాజుల కుటుంబీకుడు, మాజీ ఎమ్మెల్యే సర్వజ్ఞ యాచేంద్ర విషయంలో అనుచితంగా ప్రవర్తించి వారిని అగౌరపరిచారు. కనీసం కూర్చొబెట్టి మాట్లాడకపోగా, నిలబెట్టి నిర్లక్ష్యంగా మాట్లాడుతూ ఆఫీసు నుంచి వెళ్లిపోవాలంటూ అహంకార పూరితంగా మాట్లాడిన తీరు అప్పట్లో విమర్శలకు దారి తీసింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విషయంలోనూ తప్పుడు కేసులతో వివాదాస్పదంగా మారారు. గతంలో ఇదే అధికారి పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలు సాగలేదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఒకానొక అధికారిగా నిర్ధారించి నివేదిక ఇచ్చారు. ఇప్పుడు అదే అధికారి అక్కడ అక్రమ మైనింగ్ జరిగిందంటూ కూటమి కుట్రలో భాగస్వామ్యం అయ్యారు. ఇక మార్కెట్‌లో నాణ్యమైన క్వార్ట్జ్ మెటల్ మెట్రిక్ టన్ను రూ.12 వేల కంటే ఎక్కువ లేదు. అటువంటి మెటల్ టన్నుకు ఏకంగా టన్నుకు రూ.2 లక్షల వంతున లెక్క కట్టి కూటమి నేతల చేతిలో కీలుబొమ్మలా మారారు. తాజాగా మాజీ జెడ్పీ వైస్ చైరపర్సన్, మాజీ రాష్ట్ర సంగీత అకాడమీ చైర్మన్ పొట్టేళ్ల శీరీష సైదాపురంలో అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లితే ఆమెను అగౌరపరిచేలా వ్యవహరించడం వివాదమైంది. ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించడంతో కన్నీటి పర్యతమైంది. ఖనిజ సంపద దోపిడీ దారులకు వత్తాసుగా వ్యవహిస్తూ ఒక బీసీ మహిళను తక్కువ చేసి తూలనాడడంపై జిల్లా వ్యాప్తంగా బీసీ వర్గాలు రగిలిపోతున్నాయి.

అక్రమ మైనింగ్‌కు అండదండ

విదేశాల్లో గిరాకీ ఉన్న సైదాపురం మైకా, క్వార్ట్జ్ గనుల్లో అనధికారికంగా వ్యాపారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, మరోబడా కంపెనీ ఆర్వీఆర్ సంయుక్త భాగస్వామ్యంతో స్థానిక గనులపై కన్నేశారు. రాష్ట్ర కీలక నేతకు నెలకు రూ.30 కోట్ల ముడుపులు ఇచ్చేలా ఒప్పందంతో అనధికారికంగా గనులన్నీ చేజిక్కించుని దోపిడీ చేసేందుకు స్కెచ్ వేశారు. వీరికి సహకరించేందుకు తిరుపతిలో పనిచేస్తున్న సదరు ఈ అధికారిని నెల్లూరులో ఇన్‌చార్జిగా ఆ సీటులో కూర్చోబెట్టారు. దీంతో వారు ఆడిందే ఆటగా ఈ అధికారి వ్యవహార శైలి ఉంది. గనుల లీజు వ్యవహారాల్లో సిండికెట్‌తో కలిసిన వారికే మాత్రమే అనుమతులిస్తున్నారు. మాఫియాకు సహకరించని వారి గనులకు లీజు పర్మిషన్లు కూడా ఇవ్వడం లేదు. లీజుల వ్యవహారంలో గాని, గతంలో ఇల్లీగల్ వ్యాపారం చేసుకున్న వారికి భారీ పెనాల్టీలు వేసిన గనులకు పెనాల్టీ తగ్గిస్తానంటూ ఇప్పటికే వసూళ్ల ప్రక్రియ చేపట్టినట్లు ఆరోపణలున్నాయి.



అక్రమంగా రోడ్డు మెటల్ తరలింపు

జిల్లాలో 16కు పైగా ఉన్న క్రషర్స్ యజమానులు అనుమతి లేని ప్రాంతాల్లో రాయి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయం మైనింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని క్రషర్స్‌కు కూడా అనుమతి లేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని చెల్లించకుండా యథేచ్ఛగా మెటల్‌ను తరలిస్తున్నారు. ఈ రీతిలో అక్రమ మైనింగ్ జరుగుతున్నా ఆయా క్వారీ యజమానుల నుంచి భారీ మొత్తంలో ముడుపులు అందుకుంటూ అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మకూరులోని నాగేంద్రపురం సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై ఎస్కే జిలానీ కథనం మేరకు.. దేపూరు గ్రామానికి చెందిన నూరుల్లా (27) ఆటో నడుపుతుంటాడు. ఇటీవల అతడి భార్యకు కుమార్తె పుట్టి పురిట్లోనే చనిపోయింది. భార్య, తల్లి మధ్య విభేదాలు నెలకొనడంతో వారికి సర్ది చెప్పలేక ఆవేదన చెందుతుండేవాడు. శుక్రవారం గ్రామం నుంచి ఆటోలో పట్టణంలోని రైస్‌మిల్లు వద్దకు ఒడ్లు మరపట్టేందుకు బస్తాలు వేసుకొచ్చాడు. పనివారు లోపల ఉండగా, మిల్లు ఆవరణలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి మిల్లులోని వారు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు బాలుడి మృతి


ఉమామహేష్ (ఫైల్)

ఆత్మకూరు(చేజర్ల): మండల కేంద్రమైన గిరిజన కాలనీలో పాముకాటుకు గురై బాలుడు మృతిచెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కాలనీకి చెందిన నాగయ్య, పార్వతమ్మల కుమారుడు ఉమామహేష్ (7) ఇంటి బయట ఆడుకుంటుండగా నాగుపాము కాటు వేసింది. కొద్దిసేపటికి బాలుడు స్పృహ తప్పిపడిపోగా కాలనీవాసులు గుర్తించి నాటు మందు తినిపించారు. అనంతరం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

కండలేరులో 45.206 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 45.206 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 160, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

బస్సుల్లేక.. ప్రయాణికుల విలవిల

అమరావతి పునఃప్రారంభ సభకు 290 ఆర్టీసీ సర్వీసులు

- ఓవైపు వేసవి సెలవులు, ఎండలు
- ఆర్టీసీ బస్టాండ్‌లో తీవ్ర ఇబ్బందులు పడిన జనం


నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నెల్లూరు సిటీ: స్వస్థలాలకు, పనుల నిమిత్తం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తారెత్తించే ఎండలో నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల తరబడి ప్రయాణికులు వేచి చూశారు. శుక్రవారం అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ సభకు నెల్లూరు నుంచి 290 ఆర్టీసీ బస్సులను తరలించారు. ఈ ప్రభావం ప్రయాణికులపై తీవ్రంగా పడింది. సాధారణంగా నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి పెద్ద ఎత్తున జనం రాకపోకలు సాగిస్తుంటారు. చుట్టుపక్కల మండలాల నుంచి చాలామంది వివిధ పనుల నిమిత్తం నగరానికి వస్తుంటారు. పైగా ప్రస్తుతం వేసవి సెలవులు. బంధువుల ఊర్లకు, పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు వెళ్లేవారు అధికంగా ఉంటారు. అలాగే వేరే ఊర్ల నుంచి నెల్లూరుకు వచ్చేవారి సంఖ్య ఎక్కువే. ఈ నేపథ్యంలో ప్రధాని, సీఎం హాజరైన సభకు బస్సులను తరలించడంతో ప్రయాణికులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవి?

సెలవులు కావడంతో అనేకమంది ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. అయితే ఒకటి, రెండు బస్సులు మినహా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మా ఊరికి వెళ్లేందుకు బస్సులెప్పుడొస్తాయని అనేకమంది విచారణ కేంద్రంలో సిబ్బందిని అడుగుతూ కనిపించారు. చాలాసేపు ఎదురు చూసిన తర్వాత వచ్చిన ఒకటి అర వచ్చిన బస్సుల్లో సీట్లు సంపాదించేందుకు నానాపాట్లు పడ్డారు. ఇక వృద్ధులు, చిన్నారులు ఎండ వేడిమికి తట్టుకోలేక అవస్థలు పడ్డారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో బస్సులను సభకు తరలించిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. కనీసం ప్రధాన ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బస్సులు కేటాయించి ఉంటే బాగుండేదని చాలామంది అభిప్రాయపడ్డారు.


బస్సు రాగా ఎక్కేందుకు జనం కష్టాలు


సీటు ఉందో లేదో చూస్తూ ఒకరు.. ముందుగానే బ్యాగ్ వేస్తూ మరికొరు


తిరుపతికి వెళ్లేందుకు వేచి చూస్తూ..


ఎంతసేపు ఎదురు చూడాలో..

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పొగాకు రైతుల పొట్టకొట్టొద్దు

- మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి
- రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ
- నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్


పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్ యాదవ్, నాయకులు

కందుకూరు: 'రూ.లక్షలు ఖర్చు చేసి పండించిన పొగాకు పంటకు సరైన ధర రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి వేలంలో ధరలు పెంచకపోవడం అన్యాయం. మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం దారుణం. రైతుల పొట్టకొట్టొద్దు' అని వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. పామూరు రోడ్డులోని రెండో వేలం కేంద్రంలో పొగాకు వేలాన్ని పార్టీ నాయకులు, రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వేలం కేంద్రం నిర్వహణాధికారి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అకాలవర్షాల వల్ల నార్లు దెబ్బతిని రెండోసారి వేయాల్సి వచ్చిందన్నారు. బ్యారన్, పొలాల కౌలు రేట్లు పెరిగాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ ప్రకారం లోగ్రేడ్ బేళ్లను వ్యాపారులు కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ఇలాగే ఉంటే ప్రతి రైతులకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల నష్టం వచ్చే ప్రమాదం ఉందన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి

చంద్రబాబును నమ్మి ఓట్లు వేసిన పాపానికి పొగాకు రైతులు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మధుసూదన్ యాదవ్ చెప్పారు. ఒక్క పొగాకు రైతులకే కాకుండా, మిర్చి, ధాన్యం, పసుపు వంటి ఇతర పంటలు కూడా గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అయినా కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వ్యాపారుల మధ్య పోటీ పెరిగితేనే ధరలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గతేడాది రూ.36 వేల వరకు పలికిన క్వింటా పొగాకుకు ఇప్పుడు రూ.25 వేలు కూడా రావడం లేదని ఇంత వ్యత్యాసం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పొగాకు రైతుల పరిస్థితిని ఇప్పటికే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ధరల్లో మార్పు రాకపోతే జగన్‌మోహన్‌రెడ్డి రైతుల తరఫున పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నలమోతు చంద్రమౌళి, మండలాధ్యక్షుడు గోగినేని రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల కొండయ్య, అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్, జిల్లా కార్యదర్శి చీమల వెంకటరాజా, బూత్ కమిటీ రాష్ట్ర నేత గణేశం గంగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, పార్టీ మండలాల అధ్యక్షులు ఈదర రమేష్, అనుమోలు లక్ష్మీనరశింహం, నోటి వెంకటేశ్వరరెడ్డి, నన్నం పోతురాజు, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మేధావుల సంఘం అధ్యక్షుడు రావులకొల్లు బ్రహ్మానందం, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు కంపరాజు సాంబశివరాజు, ఐటీ వింగ్ అధ్యక్షుడు పి.అమరనాథ్‌రెడ్డి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. మూడో రోజున 16 మ్యాచ్‌లు జరిగాయి. మహర్షి దయానంద్ యూనివర్సిటీ, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, శివాజీ యూనివర్సిటీ, గురునానక్ దేవ్ యూనివర్సిటీ జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి. శనివారంతో పోటీలు ముగియనున్నాయి.


లీగ్ దశకు చేరిన ఆనందంలో..

పనికెళ్లొస్తూ కానరానిలోకాలకు..

- లారీ ఢీకొని వ్యక్తి మృతి

కోవూరు: కూలీ పనికెళ్లి తిరిగొస్తూ లారీ ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని సాయిబాబా మందిరం సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కొడవలూరు మండలం మానేగుంటపాడుకు చెందిన కాకుముడి వెంకటరమణయ్య (55) బోరు వేసే పనులకు వెళ్తుంటాడు. అతడికి భార్య, పిల్లలున్నారు. శుక్రవారం పనికి వెళ్లాడు. తిరిగి ఊరికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో నెల్లూరు వైపు నుంచి కావలి వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో వెంకటరమణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీస్‌స్టేషన్ రైటర్ రషీద్‌బాషా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి పీబీకే పరిమళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో ప్రవేశం కోసం, 4 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీల్లో చేరేందుకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. 192 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 30వ తేదీన ఐటీడీఏ పీఓ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో సీట్లను భర్తీ చేస్తామన్నారు. వివరాలకు 95506 79399 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: ప్రజలకు అబద్ధాలు చెప్పడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని నేదురుమల్లి బంగ్లాలో శుక్రవారం సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యాసంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కేడర్, వలంటీర్ల వ్యవస్థీకరణకు అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. అధిష్టానం వెంకటగిరిని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు రవికుమార్ యాదవ్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 122
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 242
లేయర్ చికెన్ : 170

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30

